

# మహాభారతం

## గ్రంథ పరిచయం, ప్రాశస్త్యం

**భా**రతీయులు పంచమవేదంగా భావించే మహాభారతాన్ని వ్యాస భగవానులు చెబుతుండగ విఘ్నేశ్వరుడు తన చేతనున్న ఘంటాన్ని ఆపకుండగా వ్రాశాడని చెప్తారు. తర్వాత కవిత్రయంగా పేరుగాంచిన ఆదికవి నన్నయ్య, తిక్కన్న, ఎర్రాప్రగడలు సంస్కృతంలోనున్న భారతాన్ని తెనిగించారు. అట్టి మహాగ్రంథాన్ని సామాన్య పాఠకులకు సులువుగా అర్థమయ్యేరీతిలో మహాభారత పరిశోధకులు, జ్ఞానప్రపూర్ణ **శ్రీ దేవిశెట్టి చలపతిరావు**గారు వ్యాఖ్యానం వ్రాశారు. ఈ నెల నుండి మహాభారతాన్ని ధారావాహికంగా అందిస్తున్నాము. **- సంపాదకులు**




మహాభారత పరిశోధకులు
**'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు** B.Sc. (Ag)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.


మంగళాచరణం :

**శ్లో॥ ఓం నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమం।**
**దేవీం సరస్వతీం వ్యాసం తతోజయముదీరయేత్॥**(1-1-1)

ప్రార్థన :

**శ్లో॥ వ్యాసం వశిష్ఠ నప్తారం శక్తే పౌత్రమకల్మషం।**
**పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిం॥**

**తా॥** వశిష్ఠుని ముని మనుమడు, శక్తిమహర్షి యొక్క మనుమడు, పరాశరమహర్షి పుత్రుడు, శుకమహర్షికి తండ్రి, నిర్మల చిత్తుడు, తపోనిధియైన వ్యాసమహర్షికి వందనం.

**మహాభారతం** మానవ జీవిత మహేతిహాసం. ఈ లోకంలో ప్రతి మానవుడు తన దైనందిన జీవితాన్ని ధర్మబద్ధంగా గడపటానికి, ఉన్నతోన్నతంగా తీర్చిదిద్దుకొనటానికి, జన్మసార్థక్య హేతువైన మోక్షాన్ని పొందటానికి, కావలసిన సమస్త విషయాలను, ఆచరణ విధానాలను, అన్ని ఉపాయాలను, మెళకువలను ఎంతో చక్కగా, సవివరంగా, సంపూర్ణంగా తెలియజేసిన సమగ్రమైన ఏకైక గ్రంథ రాజం - **మహాభారతం.**

ఈ విషయాన్ని ప్రతిజ్ఞా పూర్వకంగా ఒక ముఖ్య శ్లోకం స్పష్టం చేస్తున్నది.

**శ్లో॥ ధర్మేచార్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ।**
**యది హాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్ ॥**

(18-5-50 శ్లో)

**తా॥** ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలకు సంబంధించిన సమస్త విషయాలు -ఇందులో ఉన్నవే మరే ఇతర గ్రంథంలోనైనా ఉన్నవి; ఇందులో లేనివి మరి ఎందులోనూ లేవు-అని.

మానవుడుగా జన్మించిన ప్రతి వ్యక్తీ సాధించవలసిన పురుషార్థాలు నాలుగు ఉన్నాయి. అవే ధర్మ, అర్థ, కామ, మోక్షాలు. ఇందులో అర్థ – అంటే డబ్బు సంపాదించుకోవటం, కామ – అంటే కోరికలు తీర్చుకోవటం ఈ రెండింటినీ లోకంలో అందరూ చేస్తారు. అయితే ఇదే పరమార్థం అనుకొంటూ, ఈ రెండు విషయాలనే సర్వస్వంగా భావించి, వీటిలోనే మునిగిపోయి – నీతి, న్యాయం, ధర్మం అనే విషయాలను పట్టించుకోకుండా జీవితాలను వెళ్ళదీసేవారు – ఈ లభించిన అపురూపమైన, దుర్లభమైన మానవ జన్మను వృధాచేసుకున్న

వారే అవుతారు. అలాగాక ఎవరైతే ధర్మం తప్పకుండా, అర్థకామాలను సాధించుకుంటూ, పరమ పురుషార్థమైన మోక్షం కొరకు పరితపిస్తూ, ప్రయత్నం చేస్తారో-వారే మానవ జన్మను సార్థకం చేసుకున్న వారౌతారు. అలా తమ తమ జన్మలను సార్థకం చేసుకోవాలని నిశ్చయించుకొన్నవారికి ఈ ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలకు సంబంధించిన జ్ఞానం కావాలి. అట్టి జ్ఞానం సంపూర్ణంగా ఈ మహాభారతం ద్వారా మాత్రమే లభిస్తుందని పైన చెప్పిన ప్రతిజ్ఞా పూర్వక శ్లోకం తెలియజేస్తుంది.

ఈ విధంగా మహాభారతం మానవుడికి అంధకారంలో కరదీపికలా ఉపయోగపడుతున్నది. అందుకే వ్యాసమహర్షి -

**శ్లో॥ అజ్ఞాన తిమిరాంధస్య లోకస్యతు విచేష్టతః।**
**జ్ఞానాంజన శలాకాభిః నేత్రోన్మీలన కారకం॥** (1-1-84)

**తా॥** లోకంలోని మానవులు అజ్ఞానమనే చీకటి వల్ల గ్రుడ్డివారై, దారి గానక తిరుగాడుతుంటే, వారికి జ్ఞానమనే దీపాన్ని చూపి, నేత్ర దృష్టిని ప్రసాదించేది మహాభారతం - అన్నారు.

అంతేగాదు 'యది హాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్' - ఇందులో ఉన్నవే ఎందులోనైనా ఉన్నవి; ఇందులో లేనివి ఎందులోనూ లేవు- అని ప్రతిజ్ఞ చేయటం వల్ల-ఈ ఒక్క మహాభారతాన్ని కూలంకషంగా అధ్యయనం చేస్తే చాలు - సంపూర్ణ జ్ఞానం సిద్ధించినట్లే ? సర్వశాస్త్రాల సమగ్ర సారం సంపూర్ణంగా అందినట్లే. అందుకే మహాభారతం యొక్క మహిమను వర్ణిస్తూ వ్యాసభగవానులు -

**శ్లో ॥ యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో ద్విజః ।**
**నచాఖ్యాన మిదం విద్వాన్ నైన సస్యాద్ విచక్షణః ॥**
(1-2-382)

**తా ॥** ఉపనిషత్తులతో సహా చతుర్వేద వేదాంగములు సంపూర్ణంగా తెలిసిన పండితుడైనప్పటికీ ఈ మహాభారతాన్ని గనుక తెలుసుకొనకపోతే అతడు శ్రేష్ఠుడైన విద్వాంసుడుగా పరిగణింపబడడు - అని. కనుక ప్రతి మానవుడు మహాభారత ఇతిహాసాన్ని తెలుసుకొనితీరాలి అట్టిది ఈ గ్రంథం.

## గ్రంథకర్త

సర్వ ధర్మాలకు నిలయమై, పంచమ వేదంగా పరిగణించబడిన ఇట్టి మహాభారత గ్రంథాన్ని లోకానికి అందించిన మహామహితాత్ముడు; మహర్షులలో సుప్రసిద్ధుడు; అష్టాదశ పురాణాల గ్రంథ కర్త; సామాన్య మానవులకు సైతం భగవంతునిపై భక్తిని కలిగించటానికి భగవంతుని అవతార విశేషాలతోను, భక్తుల యొక్క చరిత్రలతోను భాగవత మహా గ్రంథాన్ని రచించిన మహానుభావుడు; ఉపనిషత్తుల సారము, బ్రహ్మవిద్యా ప్రతిపాదితము, యోగశాస్త్రము ఐన భగవద్గీతను ప్రసాదించిన పరమ జ్ఞాన స్వరూపుడు; అత్యున్నత సాధకులు, పండితులు, జిజ్ఞాసువులు అయిన మహాత్ముల యొక్క సర్వ సందేహాలను నివృత్తి చేయుటకు 'బ్రహ్మసూత్రాల'ను రచించిన ప్రజ్ఞాదురంధరుడు, ఒక్కటిగా ఉన్న వేదమంత్రాలను ఋగ్, యజు, సామ, అధర్వణ అనే నాలుగు వేదాలుగా విభజించిన ప్రతిభాశాలి - వేదవ్యాస మహర్షియే.

ద్వైపాయనమనే హ్రదంలో పుట్టినందున ద్వైపాయనుడని, నల్లగా ఉంటాడు గనుక కృష్ణ ద్వైపాయనుడని, సత్యవతీ పుత్రుడు గనుక సాత్యవతేయుడని, పరాశరుని కుమారుడు గనుక పారాశర్యుడని, వేదమంత్రాలను 4 వేదాలుగా విభాగించి, తన శిష్యుల ద్వారా లోకంలో వ్యాపింపజేసినవాడు గనుక వేద వ్యాసుడనీ ఆయనను అనేక పేర్లతో పిలుస్తుంటారు మానవులు.

ఆయన సర్వ ధర్మ స్వరూపుడు; ఆగత అనాగత జ్ఞానం గల త్రికాలవేది; సూక్ష్మదర్శి; లోక కళ్యాణం కొరకు సామాన్య మానవులకు భక్తి మార్గాన్నీ, మోక్షార్థులైన వారికి మోక్ష మార్గాన్నీ చూపిన దయానిధి; సంజయునికి దివ్య దృష్టిని ప్రసాదించిన అమోఘ దైవశక్తి సంపన్నుడు; సంస్కృతభాషలోని పదాల చేత అందంగా నాట్యం చేయించగల కళాకారుడు; మనస్సులోని భావాలను వివిధ రూపాలతో, వర్ణాలతో అద్భుతంగా చిత్రించ గల నైపుణ్యం గల చిత్రకారుడు; బహుకఠినతరమైన వేద వేదాంత రహస్యాలను అందరికీ అర్థమయ్యే విధంగా, హృదయానికి హత్తుకొనే కథలు కథలుగా అందించగల ప్రతిభాశాలి; పరమవైరాగ్యమూర్తి శ్రీ శుకునితో బాటు అనేక మంది శిష్యులకు వేద వేదాంగాలను బోధించిన ఆచార్య శ్రేష్ఠుడు - పరమగురువు; సాక్షాత్తు నారాయణాంశ సంభూతుడు; సర్వజ్ఞుడు; మేధా సంపన్నుడు - వ్యాసమహర్షి

అందుకే వ్యాసమహర్షిని 'సరస్వత్యావాసం' అన్నారు. అంటే వ్యాసుడు సరస్వతీదేవి నిలయం అని. ఎందుకంటే-

దైవానికి అర్పితమైన హృదయానికి అశాంతిగానీ, అననుకూలనములుగానీ, దుఃఖముగానీ ఎన్నటికీ ప్రాప్తించవు.

ఇతర దేశాల వారు కనీవినీ ఎరుగని ధర్మార్థకామ రహస్యాలను; వేదార్థాలను వివరించే కర్మకాండ – ఉపాసనా కాండ – జ్ఞానకాండలను; అలాగే వివిధ విద్యలను సంబంధించిన ఆయుర్వేద–ధనుర్వేద – గాంధర్వవేదాలను; అన్ని దేశాల, అన్ని కాలాల, అన్ని మతాల, అన్ని వర్ణాల, అన్ని వర్గాల, అన్ని కులాలకు చెందిన సర్వమానవాళి ధర్మబద్ధంగా జీవించటానికి, జీవిత పరమార్థమైన మోక్షాన్ని పొందటానికి కావలసిన వర్ణాశ్రమ ధర్మాలను; గృహస్తుడు నెరవేర్చవలసిన విద్యుక్త ధర్మ కర్మలను; స్త్రీ ధర్మాలను, రాజ ధర్మాలును, మోక్ష ధర్మాలను; అనేక జ్ఞాన రహస్యాలను; విజ్ఞాన విశేషాలను తన యోగశక్తి చేత ప్రత్యక్షం చేసుకొని మహాభారతం ద్వారా లోకానికి అందించిన ప్రజ్ఞాశాలి భగవాన్ శ్రీ వేదవ్యాస మహర్షి.

## గ్రంథ ఆవిర్భావం

తొలుత వేద మంత్రాలన్నీ కుప్పలు తెప్పలుగా ఒక్కటిగానే ఉండేవి. అయితే ఆయా యుగాలలోని మానవుల ఆయుర్దాయం అనేక వందల, వేల సంవత్సరాలుగా ఉండేది. కనుక వారికి వేదమంత్రాలను తెలుసుకోవటం, అర్థం చేసుకోవటం సాధ్యమయ్యేది. కాని కలియుగ మానవుల పూర్ణాయుర్దాయం వందసంవత్సరాలు మాత్రమే. అదీగాక ఈ యుగంలోని మానవుల తెలివితేటలు గాని, బుద్ధి వికాసంగాని పరిమితమైనవి, అల్పమైనవి. అల్పాయుష్కులు, అల్పజ్ఞానులు ఐన ఈ కలియుగ మానవులు వేదమంత్రాలను, అందలి రహస్యాలను తెలుసుకోవటం అసాధ్యమని భావించిన వ్యాసమహర్షి కలియుగానికి ముందే – ద్వాపరయుగం చివరలో ఒక్కటిగా ఉన్న వేదమంత్రాలను ఋగ్, యజు, సామ, అథర్వణ అనే నాలుగు వేదాలుగా విభాగించి, వాటిని తన శిష్యులైన పైల, వైశంపాయన, సుమంతు, జైమిని అనే వారికి ఒక్కొక్క వేదాన్ని అప్పగించి లోకంలో ప్రచారం చేయమని ఆదేశించాడు. అలా సర్వమానవాళికి వేదవిజ్ఞానం అందుబాటులోనికి వచ్చినప్పటికీ ఆయనలో ఇంకా ఏదో వెలితి, ఏదో కొరత, ఏదో అసంతృప్తి. ప్రాపంచిక విషయాలలో మునిగి ఈ వేద విజ్ఞానాన్ని పట్టించుకోకుండా జీవితాన్ని దుఃఖభాజనం చేసుకునే సామాన్యులకు కూడా ఈ జ్ఞానాన్ని ఎలా అందించటమా? అనే తపన, ఆరాటం. దానితో బ్రహ్మను గురించి తపస్సు ప్రారంభించాడు. అప్పుడు బ్రహ్మ ప్రత్యక్షమై వ్యాసునికి మార్గనిర్దేశనం చేశాడు.

అలా బ్రహ్మచేత అనుజ్ఞాతుడై వ్యాసమహర్షి – వేదాలు, వేదాంగాలు, వేదాలకు అంతంలో నున్న ఉపనిషత్తులలోని అనేక తత్త్వ రహస్యాలను; వివిధ శాస్త్రాలు, ఇతిహాసాలు, పురాణాలలో చెప్పబడిన అనేక కథలు, సంఘటనలు, ఉపాఖ్యానాలను; భూత భవిష్యత్ వర్తమానాలకు సంబంధించిన అనేక విషయాలను బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే నాలుగు వర్ణాల వారికి విధించబడిన విద్యుక్త కర్మలను; బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస అనే నాలుగు ఆశ్రమాల వారి ధర్మములను విధులను; కృతత్రేతా ద్వాపరకలి అనే నాలుగు యుగాలలోని రాజవంశాల, మహర్షుల చరిత్రలను; పృథ్వీ, సూర్య, చంద్ర, గ్రహ, నక్షత్ర, తారకల యొక్క ప్రమాణాలను, పరిణామాలను; పవిత్ర తీర్థాలు, దేశాలు, నదులు, సముద్రాలు, పర్వతాలు, వనాలు మొ॥న వాని వర్ణనలను; దేవ మనుష్యాది వేర్వేరు యోనులందు జన్మించుటకు గల కారణాలను; ఇంకా కురువంశం యొక్క విస్తరణ క్రమాన్ని; బ్రహ్మాది దేవతలచేత, నారదాది దేవర్షుల చేత, సకల మహర్షి మునిగణములచేత, విజ్ఞులైన మానవాళిచేత పూజించబడే శ్రీకృష్ణుని యొక్క మాహాత్మ్యాన్ని; పాండవాది మహావీరుల యొక్క గుణ గణాలను, సత్యపరాయణతను; దుర్యోధనాది దుష్టచతుష్టయం యొక్క దురాచారాలను, దుర్మార్గాలను; గాంధారీ ధర్మశీలతను; కుంతీదేవి ధైర్యాన్నీ సహన సౌశీల్యతలను; ద్రౌపదీదేవి యొక్క అనన్య సామాన్య పాతివ్రత్య మహాత్మ్యాన్నీ; విదురుని యొక్క ప్రజ్ఞాపాటవాలను; ధృతరాష్ట్రుని కౌటిల్యాన్ని – తన వాగ్దర్పణ మేర్పడే విధంగా, సర్వ లక్షణ శోభితంగా, సర్వధర్మ నిలయంగా ఈ మహాభారత ఇతిహాసాన్ని అందించటం జరిగింది.

## గ్రంథ ప్రాశస్త్యం

ధర్మతత్త్వజ్ఞులైనవారు దీనిని సర్వధర్మాలకు నిలయమైన ధర్మశాస్త్రమని; ఆధ్యాత్మిక పిపాసులైనవారు దీనిని పవిత్ర వేదాంత శాస్త్రమని; ఐతిహాసికులైనవారు దీనిని ఇతిహాసమని (చారిత్రక సత్యమని); పౌరాణికులు దీనిని సమగ్రపురాణ సముచ్చయమని; లాక్షణికులు దీనిని సర్వలక్ష్య సంగ్రహమని; ఆర్థిక వేత్తలు దీనిని ప్రముఖ అర్థశాస్త్రమని; నీతి కోవిదులు

దీనిని నీతి శాస్త్రమని; కవిపుంగవులు దీనినొక అపురూపమైన మహాకావ్యమని; రాజనీతిజ్ఞులు దీనిని రాజనీతి శాస్త్రమని - ప్రశంసించే విధంగా - ఎవరు ఏ దృష్టితో అధ్యయనం చేస్తే వారికి అదృష్టిలోనే కనిపించేటట్లుగా, ఎవరికి ఏమి కావలసివస్తే వారికి దానినే అందించే విధంగా - 'వేద విజ్ఞానఖని' యనదగిన వేద వ్యాసుడు, ఈ సర్వధర్మ స్వరూపమైన మహాభారతాన్ని హిమవత్పర్వత పంక్తుల యందలి కొండగుహ లోని తన ఆశ్రమంలో, దర్భాసనంపై శుచియై కూర్చొని, ధ్యానమగ్నుడై, జ్ఞాన దృష్టితో ఆది నుండి అంతం వరకు సర్వాన్నీ ప్రత్యక్షంగా తన మనస్సులోనే దర్శించి, ఈ లోకానికి అందించటం జరిగింది.

"భారతం పంచమో వేదః సర్వశ్రుతి సమూహోఽయం" అన్నారు. అంటే నాలుగు వేదాల యొక్క సారమంతా ఇందులో చెప్పబడింది గనుక ఈ మహాభారతం ఐదవ వేదం అని. ఒక్కొక్క వేదం కొన్ని కొన్ని విషయాలను చెప్పగా, ఈ మహాభారతం మాత్రం అన్ని వేదాలలోని అన్ని విషయాలను క్రోడీకరించి చెప్పటం జరిగింది.


అలా చెప్పవలసిన అవసరం ఏమిటి? వేదాలలో చెప్పబడ్డ అనేక విషయాలు మానవ జీవితాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దుకుంటూ, జనన మరణ రూప సంసార బంధం నుండి విడుదల పొంది, జన్మ సార్థక్య హేతువైన మోక్షాన్ని పొందటానికి తప్పక అవసరం. అయితే వేదాలు సామాన్యులకు అందు బాటులో ఉండవు. వేదమంత్రాలలోని భాష అతి నిగూఢం కనుక అర్థం చేసుకోవటం చాలాకష్టం. అందుకు తగిన తీరిక, ఓపిక, పట్టుదల ఈ నాటి మానవులలో ఉండదు. కనుక వాటి జోలికి ఎవరూ పోరు. కనుకనే వ్యాసమహర్షి ఆ వేద విజ్ఞానాన్నీ, వేద రహస్యాలను మహాభారతమనే ఇతిహాసం ద్వారా సామాన్య మానవులకు కూడా అందుబాటులోనికి తేవటం జరిగింది.

మనకు ఏదైనా జబ్బు చేసినప్పుడు దానిని తగ్గించుకొను టకు మందు వాడాలి. అయితే ఆ మందు చేదుగా ఉంటే దానిని ఉపయోగించం. అప్పుడు జబ్బు తగ్గదు. మరెలా? ఆ మందును గనుక ఒక క్యాప్సూల్‌లో పెట్టి ఇస్తే హాయిగా వేసుకుంటాం. క్యాప్సూల్ కరిగి మందు పని చేస్తుంది. జబ్బు తగ్గిపోతుంది. అలాగే మనం జనన మరణ సంసార దుఃఖమనే జబ్బుతో బాధపడుతున్నాం. దీనికి మందు వేద విజ్ఞానమే. మరి ఈ మందును మనం ఒక పట్టాన స్వీకరించం. ఎందుకంటే అర్థం కాదుగనుక. అలాగని వదిలేస్తే ఈ దుఃఖ మనే జబ్బు తగ్గదు. మరెలా? అందుకే వేద విజ్ఞానమనే అద్భుతమైన మందును మహాభారతం అనే క్యాప్సూల్ (Capsule)లో పెట్టి మన కందించాడు డాక్టర్ వేదవ్యాస మహర్షి. ఇలా చేయటం వల్ల కథలు కథలుగా, వినసొంపుగా, వింటున్న కొద్దీ 'ఇంకా ఇంకా వినాలి' అని అనిపించేటట్లుగా, 'తింటే గారెలే తినాలి - వింటే భారతమే వినాలి' అని అనిపించే విధంగా ఉండే ఈ మహాభారతాన్ని అందరూ ఎంతో ఇష్టంగా వింటారు, చదువుతారు, తెలుసుకుంటారు, ఇతరులకు చెప్పాల నుకుంటారు. ఇలా వింటూ తెలుసుకుంటూ క్రమంగా లోతుకు వెళ్ళి, ఇందులోని ధర్మాధర్మాలను, వేదవిజ్ఞానాన్ని వంటపట్టించు కుంటే మన జీవితం ఉన్నతంగా ఉంటుంది జనన మరణ రూప సంసార బంధం తెగిపోతుంది, శాశ్వత ఆనందం సిద్ధిస్తుంది. అందుకే నాలుగు వేదాల సారాన్ని ఈ మహా భారతంలో నిక్షిప్తం చేయటం జరిగింది.

దేవతలంతా ఒకసారి సమావేశమై ఈ మహాభారత గ్రంథం యొక్క గొప్పతనం, మహిమ ఏమిటో పరీక్షించాలను కున్నారట. అప్పుడు వారొక త్రాసును తెప్పించి, ఒకవైపు నాలుగు వేదాలు, ఆరు వేదాంగాలు, ఇతర శాస్త్రాలను ఉంచి, రెండవ వైపు మహాభారతాన్ని ఉంచారట. అప్పుడు ముల్లు మహాభారతం వైపే చూపిందట. అంటే మహాభారతం ఒక్కటే అన్నింటికన్న గొప్పది అని తేల్చారు. ఈ గ్రంథంలో శబ్దాధిక్యత, అర్థగౌరవం అన్ని అధికంగా ఉన్నాయి గనుక మహాభారత గ్రంథం అత్యంత మహిమాన్వితమైనదని నిశ్చయించారు. ఇంతటి మహిమాన్విత గ్రంథాన్ని, అందులో వేదవ్యాసుల హృదయాన్ని గ్రహించి మన జీవితాలను ఉన్నతోన్నతంగా తీర్చిదిద్దుకొందుముగాక!

**(మహాభారతగ్రంథ విషయం, పరిమాణం, రచనా విధానం, లేఖకుడు, గ్రంథ ప్రయోజనం మొదలైన విషయాల గురించి - వచ్చే సంచికలో)**

ధనము, ఐశ్వర్యము, విద్యా వివేకములందు ఎట్టి దోషము లేదు. రాజసిక ప్రవృత్తిగలవాని హృదయంలో చేరినప్పుడు రాగ ద్వేషాలుగా, తామసిక ప్రవృత్తిగలవాని హృదయంలో చేరినప్పుడు రాక్షసత్వంగా, సాత్విక ప్రవృత్తిగలవాని హృదయంలో చేరటం ద్వారా లోక కళ్యాణానికి, జీవిత ఆదర్శానికి ఉపకరిస్తాయి.



# మహాభారతం

## గ్రంథ రచనా విధానం 2

భారతీయులు పంచమవేదంగా భావించే మహాభారతాన్ని వ్యాస భగవానులు చెబుతుండగ విఘ్నేశ్వరుడు తన చేతనున్న ఘంటాన్ని ఆపకుండగా వ్రాశాడని చెప్తారు. తర్వాత కవిత్రయంగా పేరుగాంచిన ఆదికవి నన్నయ్య, తిక్కన్న, ఎఱ్ఱాప్రగడలు సంస్కృతంలోనున్న భారతాన్ని తెనిగించారు. అట్టి మహాగ్రంథాన్ని సామాన్య పాఠకులకు సులువుగా అర్థమయ్యేరీతిలో ధారావాహికంగా అందిస్తున్నాము. - సంపాదకులు


రచన:
మహాభారత పరిశోధకులు
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc., (Ag)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.


(గత సంచిక తరువాయి)

### మహాభారత గ్రంథ పరిమాణము రచనా విధానము

మహాభారతం ప్రపంచంలోని ఇతిహాస గ్రంథాలన్నింటిలోనూ చాలా పెద్దది. లక్ష శ్లోకాలతోను, వెయ్యి ఉపాఖ్యానాలతోను, వంద పర్వాలతోను అలరారుతున్న మహాగ్రంథం మహాభారతం.

పౌష్యం, పౌలోమం, ఆస్తీకం, ఆది అంశావతరణం, సంభవపర్వం, చతుగృహ దహనం, హైడింబం, బకవధ, చైత్ర రథం, స్వయంవరం, వైవాహికం, విదురాగమనం, రాజ్యార్థ లాభం, అర్జున వనవాసం, సుభద్రా హరణం, హరణ హారిక, ఖాండవ దహనం, సభాపర్వం, మంత్రపర్వం, జరాసంధ వధ, దిగ్విజయం, రాజసూయం, అర్ఘ్యాభి హరణం, శిశుపాల వధ, ద్యూతం, అనుద్యూతం, ఆరణ్యం, కిమ్మీర వధ.... అంటూ ఇలా మొత్తం వంద పర్వాలుగా విభాగించి వ్యాస మహర్షి మహాభారతాన్ని తయారుచేయటం జరిగింది.

అయితే ఇలా మొత్తం వంద పర్వాలను గుర్తుంచుకోవటం ఎవరికైనా కష్టసాధ్యం గనుక, మహాభారత రచన పూర్తయిన తర్వాత, నైమిశారణ్యంలో శౌనకాది మహామునులకు సూత వంశ శిరోమణి-లోమహర్షణపుత్రుడు ఐన ఉగ్రశ్రవుడు ఈ మహాభారత ఇతిహాసాన్ని చెబుతూ ఇందులోని వంద పర్వాలను 18 పర్వాలుగా సంగ్రహించినట్లుగ తెలియపరచారు.

అవే ఆది, సభా, అరణ్య, విరాట, ఉద్యోగ, భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీ, శాంతి, అనుశాసనిక, అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణ పర్వములు. ఇందులో మొదటి 5 పర్వాలను ఆది పంచకమని, తరువాతి 5 పర్వములను యుద్ధ పంచకమని, ఆ తరువాత ఉన్న స్త్రీ పర్వాన్ని వదిలి చివరి 7 పర్వాలను శాంతి సప్తకమని అంటారు. ఈ విధంగా మహాభారతం 18 పర్వాలు గల గ్రంథంగా లోకంలో అలరారుతున్నది.

ఇక ఈ మహాభారతం మొత్తం లక్ష శ్లోకాల గ్రంథం. ఇంతటి ఈ బృహత్ గ్రంథంలో మొత్తం వెయ్యి ఉపాఖ్యానాలు ఉన్నాయి. ఉపాఖ్యానాలంటే ఉపకథలు. అంటే ప్రధానమైన కథ కురు పాండవులకు సంబంధించినది. ఈ ప్రధాన కథలో అక్కడక్కడ- ఎప్పుడో జరిగిపోయిన కథలను, ఆయా సందర్భాలను బట్టి మహర్షులు, మహాత్ములు, పెద్దలు ఐన వారు చెప్పటం జరిగింది. అవే ఉపాఖ్యానాలు.

మార్కండేయాది మహర్షులు ధర్మజాదులకు అరణ్య పర్వంలో

ఎన్నో కథలు చెప్పారు. రాయబార సమయంలో నారదాది మహర్షులు దుర్యోధనునికి హితమునుపదేశిస్తూ అనేక ఉపాఖ్యానాలు వినిపించారు. అలాగే శాంతి, అనుశాసనిక పర్వాలలో అంపశయ్యపైనున్న భీష్ముడు ధర్మజాదులకు అనేక ఉపాఖ్యానాలను వినిపించడం జరిగింది.

ఇంకా అనేక పర్వాలలో మహర్షులు, విదురసంజయులు ధృతరాష్ట్రునికి హితబోధ చేస్తూ అనేక ఉపాఖ్యానాలను వినిపించారు. ఇలా మొత్తం వెయ్యి ఉపాఖ్యానాలు మహాభారతంలో వున్నాయి. ఈ ఉపాఖ్యానాలన్నీ కలిపి 76000 శ్లోకాలు కాగా, కురు పాండవులకు సంబంధించిన ప్రధాన గాథ 24000 శ్లోకాలతో ఉన్నది. ఇలా మొత్తం లక్ష శ్లోకాలతో మహాభారత ఇతిహాసం తయారైంది.

ఈ లక్ష శ్లోకాల గ్రంథంలో 8800 శ్లోకాలు కూట శ్లోకాలు, గ్రంథగ్రంథులతో కూడి ఉన్నాయి. ఈ శ్లోకాలను ఎంతటి పండితులైనా ఒక పట్టాన అర్థం చేసుకోవటం కష్టం. ఎందుకంటే వీటిలో కొన్ని శ్లోకాలు బాహ్యంగా చూస్తే ఒక అర్థంతోను, అంతరంగా చూస్తే మరో అర్థంతోనూ ఉన్నాయి. కొన్ని శ్లోకాల్లోని పదాలను అక్కడక్కడ విభజించి చూస్తే గాని అర్థం కావు. అందువల్ల ఈ 8800 శ్లోకాలను ఎంతో ఆలోచించి, ముందు వెనుకలు పరిశీలించి, చక్కగా విశ్లేషణ చేసి, ఆయా సందర్భాలను దృష్టిలో పెట్టుకొని చూస్తే తప్ప వాటి సరియైన అర్థం అవగతం కాదు. ఇలా గూఢార్థాలతో, కఠిన పదజాలంతో గ్రంథగ్రంథులతో కూడిన కూటశ్లోకాలు మొత్తం మహాభారతంలో 8800 ఉన్నాయని వ్యాసభగవానులే ప్రతిజ్ఞా పూర్వకంగా అనుక్రమణికాధ్యాయంలో ఒక శ్లోకం ద్వారా ఇలా తెలియజేశారు.

**శ్లో॥ అష్టౌ శ్లోక సహస్రాణి అష్టౌ శ్లోక శతానిచ।**
**అహంవేద్మి శుకం వేత్తి సంజయో వేత్తి వా నవా॥ (1-1-81)**

**తా॥** ఎనిమిదివేల ఎనిమిది వందల శ్లోకాల యొక్క అర్థం నాకు తెలుసు, శుకునికి తెలుసు, కాని సంజయునికి తెలుసో తెలియదో సందేహమే- అని. అంటే మహాభారతకాలం నాటి సంజయునికి కూడా స్పష్టంగా అర్థం చేసుకోలేనట్లుగా ఈ శ్లోకాలున్నాయని అర్థమౌతున్నది.

అందుకే నైమిశారణ్యంలో శౌనకాది మహామునులకు మహాభారత ఇతిహాసాన్ని వినిపిస్తున్న సూతమహర్షి ఈ సందర్భంలో ఇలా అంటున్నాడు.

**శ్లో॥ తచ్ఛ్లోక కూటమద్యాపి గ్రథితం సుదృఢం మునే!।**
**భేత్తుం న శక్యతే ऽర్థస్య గూఢత్వాత్ ప్రశ్రితస్యచ॥ (1-1-82)**

**తా॥** ఓ మునిపుంగవులారా! ఆ కూట శ్లోకాలు రహస్యము, గంభీరము ఐన అర్థాలు గలవి గనుక ఈనాటికీ వాటి రహస్యాలను ఛేదించటం కష్టంగానే ఉన్నది. ఎందుకంటే వాటి అర్థాలు గూఢమైనవి, శబ్దాలు యోగవృత్తితో కూడిన రచనా వైచిత్ర్యంతో ప్రకాశిస్తున్నవి-అని.

ఐతే ఇంతటి కఠినమైన పదాలతో, గూఢమైన అర్థాలతో, గ్రంథగ్రంథులతో, ఎవరికీ సులభంగా అర్థంగాని రీతిలో ఈ కూట శ్లోకాలను వ్యాస మహర్షి ఎందుకు చెప్పినట్లు? ఇదంతా విఘ్నాధిపతి గణపతి మాహాత్మ్యమే. ఏమిటాగాథ?

## మహాభారత లేఖకుడు గణపతి

సర్వజ్ఞుడు, నిగ్రహానుగ్రహ సమర్థుడు, బ్రహ్మర్షి శ్రీకృష్ణ ద్వైపాయనుడు మహాభారత ఇతిహాసాన్ని మనస్సులో నిర్మించు కొని, ఈ గ్రంథాన్ని శిష్యులకెలా బోధించాలి? లోకంలో దీనిని ఎలా ప్రచారం గావించాలి? అని ఆలోచనలో మునిగిపోయాడు. వ్యాసమహర్షి యొక్క ఈ ఆలోచనను తెలుసుకొన్న బ్రహ్మదేవుడు లోకకళ్యాణ కాంక్షతో స్వయంగావ్యాసుని ఆశ్రమానికి విచ్చేశాడు. వచ్చిన బ్రహ్మదేవుని జూచి ఆశ్చర్య చకితుడైన వ్యాసమహర్షి తోటి ఋషివర్యులతో కలిసి సాదరంగా ఆహ్వానించి, ఉన్నతాసనంపై ఆశీనుని గావించి, తన మనస్సులోని చింతకు గల కారణాన్ని తెలియజేశాడు.

అంత బ్రహ్మదేవుడు "మహర్షీ! నీవు మనస్సులోనే తయారు చేసుకున్న ఈ అద్భుత మహద్గ్రంథానికి లేఖకునిగా విఘ్నేశ్వరుడైన గణపతియే సర్వ సమర్థుడు. కనుక గణపతిని ప్రార్థించి, ఈ మహాకావ్యానికి లేఖకునిగా చేసికో"మని సలహా ఇచ్చి అంతర్థానమయ్యాడు.

బ్రహ్మదేవుని ఆదేశంతో వ్యాసుడు విఘ్నేశ్వరుని మనస్సులో స్మరించాడు. భక్తుల కోర్కెలు తీర్చే కల్పతరువు వంటి గణపతి స్మరించినదే తడవుగా వ్యాసుని ఎదుట ప్రత్యక్షమయ్యాడు.

అలా ప్రత్యక్షమైన గణపతితో వ్యాసమహర్షి, "గణనాథా! నేను మనస్సులోనే నిర్మించుకున్న మహాభారత ఇతిహాసానికి మీరు లేఖకులై నేను చెబుతూండగా మీరు వ్రాయాలని ప్రార్థిస్తున్నాను" అన్నాడు.

బియ్యం ఉడికేంతవరకు నీరు అవసరమైనట్లుగా, హృదయ పరిపక్వత చేకూరేంతవరకు సాధన అవసరం.

దానికి విఘ్నేశ్వరుడు, "మహర్షీ! మీ కోరిక ప్రకారం నేను లేఖకుణ్ణి అవుతాను. అయితే ఒక షరతు. గ్రంథరచన సాగుతున్న సమయంలో ఒక్క క్షణం కూడా నా లేఖిని ఆగకూడదు. అలా నిరంతరాయంగా మీరు చెబుతూ ఉంటే నేనీ గ్రంథాన్ని రచించేందుకు నాకేమీ అభ్యంతరం లేదు" అన్నాడు.

దానికి వ్యాసుడు "గణేశా! నేను చెప్పే ప్రతి శ్లోకభావాన్నీ సంపూర్ణంగా నీవు అర్థంచేసుకొని మాత్రమే వ్రాయాలి. అర్థం చేసుకోకుండా ఒక్క అక్షరం కూడా వ్రాయకూడదు" అనగా విఘ్నేశ్వరుడు తొండంతో సహా తలను ఊపి తన అంగీకారాన్ని తెలియజేస్తూ 'తథాస్తు' అన్నాడు.

ఈ ఒప్పందం ప్రకారం వ్యాసుడు ఆపకుండా గ్రంథాన్ని చెప్పాలి. గణపతి ప్రతి శ్లోకాన్ని పూర్తిగా అర్థం చేసుకొనిమాత్రమే వ్రాయాలి. వ్యాసుడు చెబుతూ చెబుతూండగానే అర్థం చేసుకుంటూ వ్రాసేస్తుంటాడు గణపతి. మరి ఎక్కడైనా రాబోయే సంఘటన గురించిగాని, ఏదైనా ఉపాఖ్యానాన్ని గురించిగాని, ధర్మాధర్మాల గురించిగానీ, వేదాంత రహస్యాల గురించిగాని ఆలోచించవలసి వస్తే ఎలా? గణపతి లేఖిని ఆగిపోతుందిగదా! అందుకే అక్కడక్కడ కొన్ని శ్లోకాలను అర్థంకానివిధంగా, లేఖకుడైన గణపతి కూడా లేఖినిని ఆపి ఆలోచించవలసి వచ్చేటట్లుగా. కొన్ని కూటశ్లోకాలను-గ్రంథగ్రంధులతో, గూఢార్థాలతో చెప్పటం జరిగింది.

అలాంటి శ్లోకాలను వ్రాయవలసి వచ్చినప్పుడు స్వయంగా గణపతి తన లేఖినిని ఆపి అర్థాన్ని గురించి ఆలోచిస్తూ ఉండగా, వ్యాసుడు తరువాతి విషయాలను, గాధను స్మరించుకొని గణపతికి చెప్పేందుకు సిద్ధమవుతూ ఉంటాడు. ఇదీ ఈ 8800 శ్లోకాలు కఠిన పదాలతోనూ, గూఢార్థాలతోనూ, గ్రంథ గ్రంధులతోనూ, సులభంగా అర్థంగాని రీతిలోనూ మహాభారతంలో ఉండటానికి కారణం.

## గ్రంథగ్రంధులతో కూడిన కూటశ్లోకం

గ్రంథగ్రంధులతో కూడిన కూటశ్లోకం అంటే ఏమిటో, అది ఎలా ఉంటుందో ఒక ఉదాహరణ చూద్దాం.

పాండవులను అజ్ఞాతవాసంనుండి ఎలాగైనా బహిర్గతం చెయ్యాలని దుర్యోధనుడు ఒక ప్రణాళిక వేశాడు. విరాటునికి గోసంపద అధికం. అందువల్ల దక్షిణ దిశనున్న గోవులను హరించుటకు సుశర్మను పంపి, ఆ మరునాడు ఉత్తర గోగ్రహణానికి సమస్త కౌరవసేనతో తాను భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామ, కర్ణ, శకుని, దుశ్శాసనులతో కూడి వెళ్ళాడు. ఉత్తర దిక్కున గల విరాటుని గోసంపదను స్వాధీనం చేసుకున్నాడు.

ఈ వార్త తెలిసిన విరాట మహారాజు కుమారుడు ఉత్తరుడు కౌరవ వీరుల నెదిరించి గోవులను తరలించుక పోయేందుకు విధిలేని పరిస్థితిలో సిద్ధమై, బృహన్నలను సారథిగా జేసుకొని యుద్ధభూమికి వచ్చాడు. యుద్ధభూమిలో ప్రవేశించగానే భీష్మ ద్రోణాది మహావీరులను, చతురంగ బలాలతో కూడిన కౌరవ సేనను ఒక్కచోట చూడగానే ఉత్తరుడు భయపడిపోయి, రథందిగి పారిపోతున్నాడు. అప్పుడు సారథి స్థానంలో నపుంసక వేషంలో ఉన్న బృహన్నల క్రిందికి దూకి, పారిపోతున్న ఉత్తరుని పట్టుకునేందుకు వెంటబడ్డాడు. ఎలాగో ఉత్తరుని పట్టుకొని, ఏదో చెప్పి, రథంపై కూర్చోబెట్టుకొని ముందుకు వస్తున్నాడు.

ఇది చూచి కురువీరులు, సేన నవ్వుకుంటున్నది. 'రథికుని కన్న విచిత్రవేషంలో ఉన్న సారథే ధైర్యశాలిగ కనబడు తున్నాడు' అని వారిలో వారు అనుకుంటున్నారు. ఆ సమ యంలో ఆచార్య ద్రోణుడు ప్రక్కనే ఉన్న భీష్ముని చూసి, ఆ వచ్చిన విచిత్ర వ్యక్తి సామాన్యుడు కాదు. అతడి శరీరాకృతి, శుభలక్షణాలను గమనిస్తే అతడు అర్జునుడే తప్ప మరెవరో కాదు- అని చెప్పే సందర్భంలో ఒక శ్లోకం ఉన్నది. అది ఇది-

**శ్లో॥ నదీజలం కేశవ నారికేతు నగాహ్వయోనామ నగారిసూను।**
**ఏషోఽంగనా వేషధరః కిరీటి జిత్వావయం నేష్యతి చాద్యగావః**

**(3-39-10)**

దీని అర్థం ఏమిటో పరిశీలిద్దాం.

నదీజలం=నదిలో నీరు; కేశవ = విష్ణుమూర్తి; నారి= స్త్రీ; కేతు = ధ్వజం; నగాహ్వయోనామ = నగము పేరుగల; నగ+అరి+సూను = నగము యొక్క శతృవు కుమారుడు. ఇంతవరకు మొత్తం భావాన్ని కలిపి చూస్తే ఎక్కడా సమన్వయం కుదరదు. కనుక దీనిని గ్రంథగ్రంధులుగా విడదీసి చూడాలి. ఎలా?

'నదీజలం కేశవ నారికేతు' - దీనిని ఇలా చూడాలి. 'నదీజ లంకేశ వనారి కేతు' ఇప్పుడు దీని అర్థం చూద్దాం. నదీజ=నదికి పుట్టినవాడా (గంగాపుత్రుడు భీష్ముడు), లంకేశ= రావణుని, వన+అరి = అశోకవనానికి శతృవు (ఆంజనేయుడు), కేతు= ధ్వజం ఇప్పుడు మొత్తాన్ని కలిపి చూస్తే **"ఓ భీష్మా! ఆంజనేయుడు ధ్వజంగా గల"** అని అర్థం వస్తుంది.

ప్రేమలేని హృదయం ప్రేత భూమితో సమానం.

ఇక 'నగాహ్వాయోనామ నగారిసూను' నగము పేరుగల, నగమునకు శత్రువు కుమారుడు - ఎవరు? నగము అంటే చెట్టు అని, పర్వతము అని రెండు అర్థాలు. 'చెట్టు పేరు గల, పర్వతములకు శత్రువు కుమారుడు' - అని మొదటి నగమునకు చెట్టును, రెండవ నగమునకు పర్వతమును అర్థంగా తీసుకోవాలి. చెట్టు పేరుగల అంటే చెట్లలో అర్జున వృక్షం ఉంది. దీనినే తెలుగులో మద్దిచెట్టు అంటాం. అలాగే పర్వతాలకు శత్రువు ఇంద్రుడు. (ఒకప్పుడు పర్వతాలకు రెక్కలు ఉండేవి. వాటిని తెగవేసినవాడు ఇంద్రుడు గనుక ఆయన పర్వతాలకు శత్రువు) ఆ ఇంద్రుని కుమారుడు **అర్జునుడు.** కనుక మొత్తం మొదటి పంక్తి యొక్క అర్థం ఇది "ఓ భీష్మా! కపిధ్వజుడు అర్జునుడు" - అని - రెండవ పంక్తి అర్థం, స్త్రీ వేషాన్ని ధరించిన ఇతడు అర్జునుడు. ఎవరిని జయించి గోవులను తరలించుకు పోయేందుకు ఇప్పుడు వచ్చాడో ఆ దుర్యోధనుని రక్షించండి- అని. ఇలా ఈ కూటశ్లోకాలు గూఢార్థంతో ఉండటంవల్ల ఎంతో ఆలోచించాలి. ఇలాంటివి 8800 శ్లోకాలు మహా భారతంలో ఉన్నాయి.

## అంకెల చమత్కారం

మహాభారతంలో ఒక అంకెల చమత్కారం ఉన్నది.

1. మహాభారతంలోని పర్వాలు మొత్తం - 18.
2. మహాభారత యుద్ధం జరిగిన రోజులు - 18.
3. యుద్ధంలో పాల్గొన్న మొత్తం అక్షౌహిణులు - 18. (కౌరవులు 11 + పాండవులు 7)
4. ఒక అక్షౌహిణిలోని ఏనుగులు 21,870. (అంకెలన్నీ కూడితే) 2+1+8+7+0 = 18.
5. ఒక అక్షౌహిణిలోని రథాలు 21,870 - 2+1+8+7+0 = 18.
6. ఒక అక్షౌహిణిలోని గుఱ్ఱాలు 65,610 - 6+5+6+1+0 = 18.
7. ఒక అక్షౌహిణిలోని కాల్బలం 1,09,350 - 1+0+9+3+5+0 = 18.
8. మహాభారత అంతర్భాగం భగవద్గీతలోని అధ్యాయములు = 18.
9. భగవద్గీత 2వ అధ్యాయంలోని స్థితప్రజ్ఞ లక్షణాలు గల శ్లోకాలు=18.
10. వ్యాసుడు వ్రాసిన పురాణాలు = 18.

ఇలా మహాభారతంలో ఒక అంకెల చమత్కారం కనిపిస్తుంది.

## గ్రంథ ప్రయోజనం

ఏ ప్రయోజనాన్ని ఆశించి వ్యాసమహర్షి మహాభారతాన్ని ఈ లోకానికి అందించాడు? మహాభారతం యొక్క అంతిమ లక్ష్యం ఏమిటి?

**"ధర్మానికి అధర్మానికి పోరాటం జరిగినప్పుడు - ధర్మానికి బలం తక్కువగా ఉన్నా, అధర్మానికి బలం ఎక్కువగా ఉన్నా- అంతిమంగా జయించేది ధర్మపక్షమే"** అని స్పష్టంచేసి మానవులందరినీ ధర్మమార్గంవైపు నడిపించడమే మహాభారత గ్రంథాన్ని లోకానికి అందించటంలో వ్యాసుని పరమోద్దేశం.

వ్యాసమహర్షి యొక్క ఈ ఆశయాన్ని చక్కగా గ్రహించినవాడు కావటం వల్లనే నైమిశారణ్యంలో శౌనకాదిమునులకు మహాభారతాన్ని వినిపించిన సూతమహర్షి చివరిగా మునులతో ఇలా అంటున్నాడు.

"నేను రెండు చేతులు పైకెత్తి నమస్కరిస్తూ మళ్ళీ మళ్ళీ చెబుతున్నాను. అయినా ఎవ్వరూ నామాట వినిపించుకోవడం లేదు. ధర్మంవల్లనే మోక్షసిద్ధి కలుగుతుంది. ధర్మం వల్ల అర్థకామాలు కూడా లభిస్తాయి. అయినప్పటికీ జనులు ఎందుకు ధర్మాన్ని ఆచరించుట లేదు? కోరికల కోసంగాని, భయంతోగాని, లోభంవల్లగాని, చివరకు ప్రాణాపాయస్థితి వచ్చినాగాని ఎట్టి పరిస్థితిలోనూ ధర్మాన్ని విడిచిపెట్టరాదు" అని.

దీనినిబట్టి ధర్మాచరణే మహాభారతం యొక్క ఆదేశం. ధర్మాచరణవల్ల సంపదలు కలుగుతాయి. కోరికలు తీరుతాయి, జయం కలుగుతుంది. చివరకు మోక్షం కూడా సిద్ధిస్తుంది అని మహాభారతం తెలియజేస్తున్నది.

ఇంతటి మహామహిమాన్వితమైన మహాభారతాన్ని అందలి సంఘటనల వెనుకగల ఆంతర్యాలను, ఆ సంఘటన ద్వారా మానవులు తెలుసుకోవలసిన జీవన సత్యాలు, ఆధ్యాత్మిక రహస్యాలు, ధర్మసూక్ష్మాలు, జ్ఞాన విజ్ఞాన రహస్యాలు, శాస్త్ర సాంకేతిక పరంగా మహాభారతంలోని విజ్ఞాన విశేషాలను క్రమంగా తెలుసుకొని మన జీవితాలను ధర్మబద్ధంగా గడుపుతూ ఉన్నతంగా తీర్చిదిద్దుకొందాం.

**మహాభారత గ్రంథంపై కువిమర్శలు ఏమిటి? విమర్శనా విధానం ఎలా ఉండాలి? మన కర్తవ్యం ఏమిటి? వ్యాసుని జన్మం - ఆ జన్మవెనుక గల మర్మం ఏమిటి? (వచ్చే సంచికలో)**

**పుస్తక విజ్ఞానం అంతా జీవనోపాధికి పనికివస్తుందిగాని, జీవిత పరమావధికి పనికిరాదు.**